తాగునీటి సమస్య పరిష్కరించాలి

● రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన అక్బర్‌నగర్ వాసులు

కోటగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్య పరిష్కరించాలి మండలంలోని అక్బర్‌నగర్ గ్రామస్థులు బుధవారం రుద్రూరు, వర్ని ప్రధాన రహదారిపై బైఠాయించారు. ప్రధానరహదారిపై ముళ్ల కంపలు, ద్విచక్ర వాహనాలు అడ్డంగా పెట్టి పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్రామంలో వారం రోజుల నుంచి తాగునీటి సమస్య తలెత్తినా.. పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదన్నారు. తాగునీటి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు, మండల ప్రత్యేక అధికారి సంతోష్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు రాస్తారోకోను విరమించారు.



రుద్రూరు, వర్ని రోడ్డుపై ఖాళీ బిందెలతో బైఠాయించి ఆందోళన చేస్తున్న అక్బర్‌నగర్ వాసులు

ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలి

● రీజినల్ మేనేజర్ జోత్స్నకు సీపీఐ (ఎంఎల్) నాయకుల వినతి

సుభాష్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథ నాయకులు బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో-1 ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం రీజినల్ మేనేజర్ జ్యోత్స్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల మూడు వేల బస్సులను తగ్గించడం ప్రభుత్వ కుట్రపూరిత చర్యగా భావిస్తున్నామన్నారు. ఇప్పటికే చాలా బస్సులు పాతబడి నిరంతరం రిపేర్లకు గురవుతున్నాయన్నారు. అదనపు బస్సులను వేయాల్సిన సమయంలో బస్సులను తగ్గించడం వల్ల ప్రయాణికులు కిక్కిరిసి తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బస్టాండ్‌లో కనీస మౌలిక సౌకర్యాలు కరువయ్యాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథ నాయకులు వెంకన్న, సాయన్న, ఎం.సుధాకర్, గంగాధర్, రాజేశ్వర్, కిషన్, మురళి, సంధ్యారాణి, గణేష్, సాయిబాబా, మోహన్, సాయరెడ్డి పాల్గొన్నారు.



డిపో-1 ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథ నాయకులు

ఇందిరమ్మ ఇళ్ల పథకం

అర్హుల ఎంపికకు సన్నద్ధం

- రెండు రోజుల్లో ప్రత్యేక యాప్‌ను విడుదల చేయనున్న ప్రభుత్వం
- యాప్‌లో ఉన్న వివరాల ఆధారంగా అర్హుల ఎంపిక
- ప్రతీ నియోజకవర్గంలో 3,500 మందిని ఎంపిక చేయనున్న అధికారులు
- ప్రతీ ఇంటికి నాలుగు విడతల్లో ఐదు లక్షల రూపాయలను అందించనున్న సర్కారు

నిజామాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అర్హుల ఎంపికకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వం రెండు రోజుల్లో ఈ ఇళ్ల ఎంపిక కోసం ప్రత్యేక యాప్‌ను విడుదల చేయనుండటంతో అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ యాప్‌లో ఉన్న ప్రజాపాలన దరఖాస్తులకు అనుగుణంగా పేదల వివరాలను పరిశీలించనున్నారు. ఆయా గ్రామాల పరిధిలో ప్రత్యేక బృందాల ద్వారా వారి వివరాలను పరిశీలిస్తారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా అర్హులను ఎంపిక చేయనున్నారు. ప్రభుత్వం ఇప్పటికే లబ్ధిదారుల ఎంపికకు ఆదేశాలు ఇవ్వడంతో ముందస్తుగా ఏర్పాట్లను చేస్తున్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. ఈనియోజకవర్గాల వారీగా వచ్చిన దరఖాస్తుల నుంచే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ పథకం కింద ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇళ్లను కేటాయించింది. సొంత స్థలాలు ఉన్న పేదలకు వీటిని మంజూరు చేయనున్నారు. ఇంటి నిర్మాణానికి నాలుగు విడతల్లో 5లక్షల రూపాయలను మంజూరు చేయనున్నారు. ప్రభుత్వం ఈ ఇళ్ల మంజూరుతో పాటు నిర్మాణాలు కూడా చేపట్టేందుకు సిద్ధమవుతోంది. వచ్చే మార్చి నాటికి ఎక్కువ సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టే విధంగా చర్యలను చేపడుతోంది.



జిల్లాలో 19,250 ఇళ్ల మంజూరు

జిల్లాలో ఆరు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 19,250 ఇళ్లు మంజూరు అయ్యాయి. నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలకు 3500 చొప్పున ఇళ్లు మంజూరు కాగా, బాన్సువాడ నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు అయ్యాయి. ఈ నియోజకవర్గంలో సగం ఇళ్లు కామారెడ్డి జిల్లా పరిధిలోని మండలాలకు కేటాయించగా మరో సగం ఇళ్లు 1750 జిల్లాకు కేటాయించారు. మొదటి విడత కింద ఈ ఇళ్లను లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు అధికారులు కసరత్తు మొదలు పెట్టారు.

ఇళ్ల పథకానికి ప్రత్యేక యాప్

ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను తీసుకువస్తోంది. దరఖాస్తులన్నీ యాప్‌లో అప్‌లోడ్ చేయనుంది. అర్హులైన వారికి మొదటి విడత కింద ఇళ్లను మంజూరు చేయనున్నారు. ఇప్పటికే గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక కోసం ప్రత్యేక కమిటీలను నియామకం చేశారు. గ్రామానికి కేటాయించిన ఇళ్ల సంఖ్యకు అనుగుణంగా అర్హులను ఎంపిక చేయనున్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం జిల్లాలో ప్రజాపాలన సమయంలో సుమారు రెండు లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఒక్కొక్క నియోజకవర్గంలో 40వేలకు పైగా దరఖాస్తులు చేశారు. వీటన్నింటి వివరాలను ఈ యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఆ యాప్‌లో వివరాలు ఎంట్రీ తర్వాత మండలాల వారీగా ప్రత్యేక బృందాలను నియమించి అర్హులైన వారిని ఎంపిక చేస్తారు. ఇంటి నిర్మాణం కోసం 5లక్షల రూపాయలను మంజూరు చేస్తారు. ఈ డబ్బులను కూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం మొదలు పెట్టగానే ఒకేసారి మంజూరు చేయకుండా నాలుగు విడతల్లో ఇవ్వనున్నారు. బేస్‌మెంట్ నుంచి స్లాబ్ వరకు వివిధ స్టేజీల్లో ఈ డబ్బులను వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ దఫా ఇందిరమ్మ పథకం కింద ఇచ్చే అన్ని ఇండ్లను కూడా మహిళలకే కేటాయించనున్నారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా

మిగతా 8వ పేజీలో...



ఆర్మూర్ గురుకుల పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

వసతి గృహాల్లో ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి
- విజయ డెయిరీ పాలనే వినియోగించాలి
- వసతిగృహాల్లోనే వాచ్‌మన్, ఉపాధ్యాయుడు బసచేయాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలు వసతిగృహాలల్లో ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశించారు. బుధవారం పట్టణంలోని ఆర్మూర్, వేల్పూర్ ప్రభుత్వ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలను, వసతిగృహాలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తనిఖీ చేశారు. స్టోర్‌రూం, డైనింగ్‌హాల్, వంట గది, స్టోరూంలో నిల్వ ఉంచిన సన్నబియ్యం, వంట నూనె, పప్పుదినుసులు, కూరగాయల ఇతర సరుకుల నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి సరఫరా చేస్తున్న సన్నబియ్యం నాణ్యతలో తేడా ఉన్నదా? అని మెస్ ఇన్‌చార్జీలను ప్రశ్నించారు. భోజనం వండడానికి ముందే ప్రతీరోజు సరుకుల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలని, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం వండేలా చూడాలని సూచించారు. విద్యార్థులకు మెనూప్రకారం పౌష్టికాహారం అందించాలని, ఉదయం సాయంత్రం వేళల్లో అల్పాహారం, స్నాక్స్ ఇవ్వాలన్నారు. విజయడెయిరీ పాలనే వినియోగించాలని, రాత్రి వేళల్లో ఎఎన్ఎం, వాచ్‌మెన్‌తో పాటు పర్యవేక్షణకు ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరిగా వసతి గృహాల్లోనే బస చేయాలన్నారు. నీటి సంపు, వాటర్‌ట్యాంకులను పరిశీలించిన కలెక్టర్ మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతున్నాయా అని అడిగితెలుసుకున్నారు. నీటి సరఫరా జరుగుతున్నప్పటికీ ఆర్వో ప్లాంట్లు లేవని నిర్వాహకులు తెలపడంతో వాటిని త్వరలోనే ఏర్పాటు చేయిస్తానని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ గజానన్, అధికారులు ఉన్నారు.

శిథిలావస్థలో బాలుర జూనియర్ కళాశాల

- పిప్రి బాలుర కళాశాలలో పగిలిన రేకులు, విరిగిన కిటికీలు
- పాఠశాల వరండా, చెట్ల కింద కొనసాగుతున్న విద్యార్థుల చదువులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

7



ఇసుక అక్రమ డంపులపై చర్యలు కరువు

- ఎడపల్లిలో భారీగా ఇసుక అక్రమ నిల్వలు
- రాజకీయ నేతల సహకారంతో యథేచ్ఛగా కొనసాగుతున్న దందా
- చోద్యం చూస్తున్న అధికారులు

7



హోరాహోరీగా యువజన కాంగ్రెస్ ఎన్నికలు

- జిల్లా అధ్యక్షుడిగా విపుల్‌గౌడ్
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నరాల నిహార్
- నవంబర్ 15 నుంచి 21 వరకు ఆన్‌లైన్ పద్ధతిలో ఎన్నికల నిర్వహణ
- జిల్లా వ్యాప్తంగా 40వేలకు పైగా నమోదైన ఓట్లు

8





హైదరాబాద్‌లోని తన నివాసంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

హామీలను అమలు చేసేవరకూ కాంగ్రెస్ వెంట పడతాం..

- రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా జలాలను తరలిస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు
- తెలంగాణ తల్లి రూపురేఖలు మార్చడం కాదు.. మహిళల హామీలు అమలైనప్పుడే నిజమైన నివాళి
- తెలంగాణ జాగృతి ఉమ్మడి జిల్లా సమావేశంలో ఎమ్మెల్సీ కవిత

సుభాష్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేంత వరకూ వెంటపడుతూనే ఉంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో ఏర్పాటు చేసిన నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల జాగృతి సంస్థ నాయకుల సమావేశంలో కవిత మాట్లాడారు. మహాలక్ష్మి పథకం కింద

మిగతా 8వ పేజీలో...



నాట్లు షురూ

నవీపేట మండలంలో యాసంగి వరి నాట్లను ప్రారంభించారు. కమలాపూర్ గ్రామానికి చెందిన బొడ్డు శ్రీనివాస్ రెడ్డి అనే రైతు తన 12 ఎకరాల్లో నాట్లను చేపట్టారు. అక్టోబరు 25న నారు పోయగా వారం రోజుల నుంచి నాట్లు చేపట్టాడు. ఏప్రిల్ 1నాటికి పంట చేతికి వస్తుందని ఆయన తెలిపారు. బీహార్‌కు చెందిన కూలీలు ఎకరం నాటుకు రూ.5500 చొప్పున తీసుకుంటున్నారని ఆయన వివరించారు.

- నవీపేట

ఏడాది పూర్తయినా.. హామీలను నెరవేర్చని కాంగ్రెస్

- రైతులకు రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయలేదు
- వృద్ధులు, వికలాంగుల పెన్షన్లు పెంచలేదు
- విలేకరుల సమావేశంలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

నిజామాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా.. ఇప్పటి వరకు హామీలను నెరవేర్చలేదని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం నగరంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారితో కలిసి విలేకరులతో మాట్లాడారు. పార్టీ ఆధ్వర్యంలో రూపొందించిన చార్జ్‌షీట్‌ను విడుదల చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. జిల్లాలో 2లక్షల 75వేలకు పైగా రైతులు ఉంటే కేవలం లక్షలోపే మాఫీ చేశారని అన్నారు. రైతు భరోసా ఇప్పటి వరకు అమలు చేయలేదని ఆయన విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు ఏవి ఇవ్వడం లేదన్నారు. ఎన్నికల సమయంలో మంచిప్ప ఎత్తు పెంచమని హామీ ఇచ్చి ఇప్పటివరకు పట్టించుకోవడం లేదని విమర్శించారు. జిల్లాకు మంత్రి లేకపోవడం వల్ల తగినన్ని నిధులు రావడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వికలాంగులతో పాటు వృద్ధులకు పెన్షన్ పెంచలేదన్నారు. ప్రజలకు ఇచ్చినహామీలు ఎగ్గొట్టినందుకు సంబరాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

మిగతా 8వ పేజీలో...

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇన్‌చార్జిలదే ఇష్టారాజ్యం!

● మధ్యవర్తుల ప్రమేయం లేనిదే పూర్తి కాని పనులు



సబ్‌రిజిస్ట్రార్ చుట్టూ గుమిగూడిన డాక్యుమెంట్ రైటర్లు

ఖిల్లా, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా రిజిస్ట్రేషన్ శాఖలో ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్లు సెలవుల్లో ఉండడంతో ఇన్‌చార్జిలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.వేలల్లో దండుకుంటున్నారు. మధ్యవర్తులు లేనిదే పనులు చేయడం లేదు. సమయం ముగిసినా.. కార్యాలయ తలుపులు వేసుకుని రాత్రి వరకు లోపల పనులు కానిస్తున్నారు. గత నెలలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, డాక్యుమెంట్ రైటర్లు సబ్‌రిజిస్ట్రార్లపై తిరుగుబాటు ఎగరవేసి ఏకంగా ఆ శాఖ డీఐజీకి ఫిర్యాదు చేశారు. దీంతో వారం రోజుల పాటు వారు పనులు చేయడానికి ముందుకు రాలేదు. అనంతరం వీరిద్దరి మధ్య సయోధ్య కుదుర్చుకుని పనులు వేగంగా చేయడం మొదలు పెట్టారు. బుధవారం సాయంత్రం 'ఆంధ్రజ్యోతి' రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లగా సబ్‌రిజిస్ట్రా చాంబర్‌ను అనుకుని పదుల సంఖ్యలో డాక్యుమెంట్ రైటర్లు పోటీపడుతూ పనులు పూర్తి చేయించుకోవడం కనిపించింది. డీఐజి కార్యాలయంలో పనిచేసే సినియర్ అసిస్టెంట్ కొంతకాలంగా ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తూ ప్రతిరోజూ వేలల్లో దండుకుని ఇంటికి తీసుకెళ్తున్నట్లు సమాచారం. ఇతను ఎక్కడ సబ్‌రిజిస్ట్రార్ సెలవులపై వెళ్తారో అక్కడ వెంటనే ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకుంటున్నాడు. ఐదు నెలలుగా నిజామాబాద్ అర్బన్, రూరల్‌తో పాటు జిల్లాలోని ఇతర కార్యాలయాల్లో సైతం ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తూ అందినకాడికి దండుకుంటున్నాడు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

ఎడపల్లి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు బుధవారం సైబర్ నేరాలు, షీ టీంలపై ఎడపల్లి పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు హాజరై విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎస్సై వంశీ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ గంగా శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ముప్కాల్: విద్యార్థి దశ నుంచే సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ముప్కాల్ ఏఎస్సై గంగారాం అన్నారు. బుధవారం ముప్కాల్ మండల కేంద్రంలో కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కల్పించారు. ఈ సందర్భంగా మొబైల్ ఫోన్‌ల ద్వారా 80శాతం సైబర్‌నేరాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సాంకేతికతను ఆసరగా చేసుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని అవగాహన పెంచుకొని ఇటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్త పడాలన్నారు. తమ చుట్టు ఉన్న సమాజాన్ని కూడా జాగృతం చేయాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ వినోద, కానిస్టేబుల్ సాగర్, కావేరి, సౌమ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ పనితీరుపై..

భీమ్‌గల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ చేపడుతున్న పనితీరుపై శ్రీసరస్వతి విద్యామందిర్ పాఠశాల విద్యార్థులకు ఎస్సై మహేష్‌కుమార్ అవగాహన కల్పించారు. శ్రీ సరస్వతి విద్యామందిర్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులకు క్షేత్రస్థాయిలో భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎఫ్ఐఆర్ ఎస్‌హెచ్‌వో సైబర్ కేసులు, సివిల్, క్రిమినల్ కేసులపై ఎస్సై అవగాహన కల్పించారు. అనంతరం సిబ్బందిని పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిచరణ్, శ్రీవాణి, పీఈటీ సుమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణం నిలిపివేయాలి

భీమ్‌గల్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని సాయిరాం నగర్‌కాలనీలో నిర్మిస్తున్న సెల్‌టవర్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని కోరుతూ కాలనీవాసులు బుధవారం తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్, ఎస్సై మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జనవాసాల మధ్య సెల్‌టవర్‌లు నిర్మించవద్దని ట్రాయ్ నిబంధనలకు విరుద్ధంగా కాలనీ ఇళ్ల మధ్యన ఎయిర్ టెల్‌సెల్ టవర్‌ను నిర్మిస్తున్నారని దీంతో భవిష్యత్‌లో కాలనీవాసులు, చిన్నపిల్లలు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని కనుక సెల్‌టవర్‌ను ఇక్కడి నుంచి తరలిరావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రఘు, రమణారెడ్డి, నిఖిల్, లావణ్య, గంగామణి, సునీత, బాగ్య, మంజుల ఉన్నారు.

వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం అందించాలి

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పీడీఎస్‌యు జిల్లా ప్రధానకార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. బుధవారం పట్టణంలోని పీడీఎస్‌యు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల హాస్టళ్లలో ఫుడ్ సెఫ్టీ కమిటీలను వేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు పండ్ల పంపిణీ

వేల్పూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని కిచెన్ గార్డెన్‌లో పండిన పండ్లను విద్యార్థులకు బుధవారం ప్రధానోపాధ్యాయులు రాజేందర్‌గౌడ్ పంపిణీ చేశారు. జులైలో నాటిన అరటి, జమ, బొప్పాయి పండ్లు కాయడంతో అరటి పండ్లకు విద్యార్థులకు పంపిణీ చేశామని హెచ్‌ఎం తెలిపారు. చెట్ల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన సిబ్బందికి విద్యార్థులకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ ధ్యేయం

● సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలం పరిశీలించిన ఎమ్మెల్యే


సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్‌రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఆచన్‌పల్లిలో 33/11సబ్ స్టేషన్ నిర్మాణానికి అనువుగా ఉన్న 20గుంటల భూమిని సబ్ స్టేషన్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం సాలూర క్యాంప్ గ్రామంలో 33/11కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. సాలూర క్యాంప్, జాడిజమాల్‌పూర్ రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు స్థల పరిశీలన జరిపి అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. బోధన్ డివిజన్ విద్యుత్ కార్యాలయం కోసం రాకాసిపేటలో 800గజాల స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, తహసీల్దార్ విఠల్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చీల శంకర్, పులి శ్రీనివాస్, ట్రాన్స్‌కో డీఈ ముక్తార్ హైమద్, ఏడీఈ తోట రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహరాజ్‌కు ఎమ్మెల్యే పూజలు

బోధన్‌రూరల్: గిరిజనుల అరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్, శ్రీ రామరావు మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని బుధవారం బోధన్ మండలంలోని రాజీవ్‌నగర్ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రత్యేక పూజల అనంతరం సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

విద్యార్థి కుటుంబాన్ని పరామర్శ

పట్టణంలోని ఆచన్‌పల్లి ప్రాంతానికి చెందిన శివ జశ్విత్ రెడ్డి అనే విద్యార్థి ఇటీవల జిల్లా కేంద్రంలోని ప్రైవేటు కళాశాలలో మృతి చెందాడు. దీంతో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి శివ జశ్విత్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు భాస్కర్ రెడ్డి, శ్రావణి కన్నీటిపర్యంతమయ్యారు. కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే తన కుమారుడు మృతి చెందాడని, తమకు న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు.

తమిళనాడు పసుపు మార్కెట్‌ను సందర్శించిన
కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ

● స్టడీ టూర్‌లో భాగంగా తమిళనాడు పసుపు మార్కెట్‌ను సందర్శించిన పాలకవర్గ సభ్యులు


పసుపు మార్కెట్‌ను పరిశీలిస్తున్న పాలకవర్గ సభ్యులు

కమ్మర్‌పల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్టడీ టూర్‌లో భాగంగా తమిళనాడులోని పసుపు మార్కెట్‌గా పేరుగాంచిన సేలం, ఎరోడ్ పసుపు మార్కెట్‌ను కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య మాట్లడుతూ.. మన రైతులు, కమీషన్ ఏజంట్లు, ట్రేడర్స్ మూడు విభాగాలుగా విక్రయాలు జరుగుతాయని తమిళనాడు సేలం మార్కెట్‌లో పసుపును పండించిన రైతులు నేరుగా మార్కెట్‌కు తరలించిగా ట్రేడర్స్ అందరు ఉమ్మడిగా కూర్చొని మార్కెటింగ్ సిస్టమ్ ద్వారా రేటును నిర్ణయించి రైతుకు తెలిపే పద్ధతిన విక్రయాలు జరుగుతాయన్నారు. ప్రస్తుం క్వింటా రూ.15 వేలు దాటి ఉందని తెలిపారు. దీంతోపాటు వ్యవసాయ ఉత్పత్తులు, మద్దతు ధరలకు విక్రయించుకోవడానికి రెగ్యులెటెడ్ మార్కెట్‌కు తరలించి బిడ్డింగ్ చేసుకునే విధానం, గోదాముల్లో నిలువ ఉంచుకునే పద్ధతులు తదితర మరెన్నో విషయాలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. స్టడీటూర్‌లో వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, డెక్టర్‌లు బి మహిపాల్, రోక్కం సంపత్ రెడ్డి, జైడి మధులత శ్రీనివాస్, బనావత్ రాములు, లక్మ రంజీత్, కిష్ట చిన్నబాజన్న, కోరిపెల్లి లింగారెడ్డి తదితర డైరెక్టర్‌లు ఉన్నారు

టీడీపీ సభ్యత్వ నమోదుకు స్పందన

బోధన్‌రూరల్,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): బోధన్, బాన్సువాడ నియోజకవర్గాలలో తెలుగు దేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఎన్‌టీఆర్ అభిమానులు, చంద్రబాబు నాయుడు అభిమానుల నుండి విశేష స్పందన లభిస్తుందని పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి విఠల్ అన్నారు. బుధవారం వర్ని మండలం శ్రీనగర్ గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చే సంస్థాగత ఎన్నికలలో పార్టీ ఆదేశాల మేరకు పోటీలో పాల్గొంటామన్నారు. ఆన్‌లైన్‌లో సభ్యత్వం నమోదు చేసుకోవచ్చన్నారు. సభ్యత్వం చేసుకున్న వ్యక్తికి 5లక్షల రూపాయల ఇన్సూరెన్స్ సౌకర్యం ఉంటుందన్నారు. ఇప్పటికి వరకు తెలుగు రాష్ట్రాలలో 60లక్షల మంది సభ్యత్వం తీసుకున్నారని వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తిలక్, హేమంత్, సాత్విక్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాల కోసం గురువారం జిల్లా ఉపాధి అధికారి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్‌రావు తెలిపారు. మణపురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేటు లిమిటెడ్, ఎంజీబి మోటార్స్ అండ్ ఆటో ఏజెన్సీస్ కంపెనీల వారు ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నారని సేల్స్ ఎగ్జిక్యూటీవ్, సేల్స్ మేనేజర్, అకౌంటెంట్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఇంటర్, డిగ్రీ, ఎంకామ్, బీకాం, ఎంబిఏ పాసైన పురుష, మహిళ అభ్యర్థులు హాజరుకావచ్చని అన్నారు. నిజామాబాద్, బోధన్, బాన్సువాడ, భైంసా, నిర్మల్, తెలంగాణ మొత్తం పనిచేయాల్సి ఉంటుందని ఆసక్తిగల వారు ఉదయం 10.30 గంటలకు హాజరుకావాలన్నారు. వివరాలకు 9948748428, 6305743423 నెంబర్లను సంప్రదించాలన్నారు.

సారంగపూర్ ఆలయ హుండీ లెక్కింపు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న సారంగపూర్ హనుమాన్ దేవాలయ హుండీని లెక్కించారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన హుండీ లెక్కింపులో ఆలయానికి 55వేల 922 రూపాయలు ఆదాయం రాగా అందులో 53,640 రూపాయలు నోట్ల రూపంలో, 2,282 నాణెల రూపంలో ఆదాయం సమకూరింది. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకురాలు కమల, కార్యనిర్వాహణాధికారి ఫిట్‌పర్సన్ వేణు, ఆలయ అర్చకుడు శశికుమార్, రాందాసి, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్ పాల్గొన్నారు.

శంభులింగేశ్వర ఆలయంలో..

ప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న శంభులింగేశ్వర దేవస్థానం హుండీని లెక్కించారు. దేవాదాయ శాఖ పరిశీలకురాలు కమల, ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రీరాం రవీందర్‌గుప్త ఆధ్వర్యంలో నిర్వహించిన హుండీ లెక్కింపులో 44వేల 22 రూపాయలు ఆదాయం వచ్చింది. ఆదాయంలో 38,330 రూపాయలు నోట్ల రూపంలో రాగా, 5,692 రూపాయలు నాణెల రూపంలో ఆదాయం సమకూరింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు దేవశర్మ, వాసు పాల్గొన్నారు.

పెద్ద రాంమందిర్..

నగరంలోని బ్రహ్మపురిలోగల బడా రాంమందిర్ హుండీని లెక్కించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకురాలు ఆధ్వర్యంలో జరిగిన హుండీ లెక్కింపులో ఆలయానికి 10వేల 442 రూపాయలు ఆదాయం వచ్చింది. ఇందులో 9,240 రూపాయలు నోట్ల రూపంలో రాగా, 1,202 నాణెల రూపసంలో ఆదాయం సమకూరింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు బ్రహ్మేశ్వర్‌కర్, శ్రీనివాస్‌చార్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ప్లాంట్ అందజేత

బోధన్‌రూరల్,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): సాలూర మండలంలోని తగ్గెల్లి ప్రభుత్వ పాఠశాలకు బుధవారం 25వేల రూపాయల విలువ గల మినరల్ వాటర్ ప్లాంట్‌ను విద్యార్థుల సౌకర్యార్థం ఐ లవ్ మై విలేజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగేందర్ అందజేసినట్లు హెచ్‌ఎం నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ లవ్ మై విలేజ్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ప్రభావతిలతో అశోక్, కస్తూరి, హన్మాండ్లు, విజయ లక్ష్మి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మందిర నిర్మాణానికి విరాళం

ఎడపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన రేణుకా ఎల్లమ్మ దేవి మందిర నిర్మాణానికి బీజేపీ సీనియర్ నాయకులు కందగట్ల రాంచందర్ బుదవారం విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుర్నాపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న రేణుకా ఎల్లమ్మ దేవి ఆలయ నిర్మాణానికి తనవంతు సాయంగా 21వేల రూపాయలను విరాళంగా అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రవీందర్ గౌడ్, బాలరాజ్ గౌడ్, బిజేపి జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లెపూల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు నాయిని లక్మన్ గౌడ్ తదితరులు ఉన్నారు.

అడవులు, వణ్యప్రాణుల సంరక్షణపై అవగాహన

కమ్మర్‌పల్లి, డిసెంబరు 4: (ఆంధ్రజ్యోతి) ప్రపంచ వణ్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకుని కమ్మర్‌పల్లి అటవీప్రాంతంలో ఎస్‌వీఎస్ పాఠశాల విద్యార్థులకు కమ్మర్‌పల్లి అటవిక్షేత్రాధికారి (ఎఫ్ఆర్‌వో) బి రవిందర్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అడవుల సంరక్షణ, పెంపకం, నీటివనరులు, పరిరక్షణ, అటవీ చట్టాలు అటవీప్రాణుల భద్రత, రక్షణ, ప్రజల బాద్యత తదితర అంశంపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీఎస్ పాఠశాల కరస్పాండెంట్ ఏనుగు గంగారెడ్డి, కోఆర్డినేర్ జాన్ సుందర్, ఉపాధ్యాయులు నకుల్, సింపోనియా, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత


అగ్ని ప్రమాద బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న సునీల్‌కుమార్

మెండోర, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అగ్ని ప్రమాద సంఘటన స్థలాన్ని బుధవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పరిశీలించారు. మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు గృహాలు పూర్తిగా దగ్ధమై విషయం తెలిసిందే. నష్టపోయిన బాధితులకు సునీల్‌కుమార్ పరామర్శించి ధైర్యం చెప్పారు. తక్షణ సహాయం కింద రూ.10వేల నాలుగు కుటుంబాలకు అందజేశారు. బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున బాధితులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్ల అందేలా కృషి చేస్తానని, స్థలం ఉన్న వారికి ఇందిరమ్మ పథకం కింద ఇల్లు కట్టుకునే వారికి రూ.5లక్షలు అందేలా చూస్తానని జిల్లా అధికార యంత్రాంగంతో మాట్లాడి ప్రభుత్వం తరఫున అందే సహాయం తొంద రలోనే చేస్తానని తెలిపారు. అగ్ని ప్రమాదంలో కట్టుబట్టలతో సహ కాలిబుడిద అయ్యాయని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి ఆర్థిక సహాయం అందేలా చూడాలని ముత్యాల సునీల్‌కుమార్ మండల బాధిత కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆయన వెంట వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, కొప్పెల మోహన్, మౌలానా, ప్రమోద్, తదితరులు ఉన్నారు.

తమను కొందరు అధికారులు వేధిస్తున్నారు

● ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సదర్ హోమ్‌లో ఉంటున్న యువతులు

నిజామాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ నగరంలోని సదర్ హోమ్‌లో ఉంటున్న యువతులు అధికారులపై ఫిర్యాదులు చేశారు. తమను కొంత మంది అధికారులు వేధిస్తున్నారని ఉన్నతాధికారులకు లేఖలు పంపారు. వివిధ సమస్యలతో ఆశ్రయం కోసం సదర్ హోమ్‌కు వచ్చిన వారిని కొంత మంది అధికారులు సొంత పనులకు ఉపయోగించుకుంటున్నారని వారు ఉన్నతాధికారులకు పంపిన లేఖల్లో పేర్కొన్నారు. వీరి వేధింపులకు తాళలేక ఒక యువతి సదర్ హోమ్ నుంచి పారిపోయారు. ఈ హోమ్‌లో పనిచేసే ఇన్‌చార్జి కూడా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండానే వెళ్లిపోయారు. జిల్లాలో వివిధ సమస్యలపై బాధింపబడ్డ బాధిత యువతులకు భరోసా కల్పించేందుకు ఈ హోమ్‌కు తీసుకువచ్చి ఉంచుతున్నారు. వారికి వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చి తమ సొంత కాళ్లపై నిలబడే విధంగా అవకాశాలు కల్పిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులను ఈ హోమ్‌కు పర్యవేక్షణకు నియమించారు. ఈ హోమ్‌లో ఉంటున్న వారి కోసం డొనేషన్లను కూడా ఇస్తున్నారు. ఈ హోమ్‌లో ఉన్న యువతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదులు అందించడంతో ప్రత్యేక అధికారి ద్వారా వివరాలను సేకరిస్తున్నారు. ఉన్నతాధికారులు తమకు భరోసా కల్పించేందుకన్న ఇంటి పనులతో పాటు ఇతర పనులు చేయించుకుంటున్నారని వారు ఉన్నతాధికారులకు పంపిన లేఖలో పేర్కొన్నారు. తమకు భరోసా కల్పించడంతో పాటు తగిన శిక్షణ అందించి స్వశక్తితో నిలబడే విధంగా చూడాలని కోరారు. ఈ విషయంపై జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారిని రసూల్‌బీని వివరణ కోరగా అన్ని వివరాలను వెల్లడిస్తానని ఆమె తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లానని ఆమె తెలిపారు. కొంత మంది హోమ్ మూతబడుతుందనే ఉద్దేశ్యంతోనే ఈ ఆరోపణలు చేస్తున్నారని ఆమె తెలిపారు.

మెగా ఒలింపియాడ్ రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులు

పెర్కిట్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని నలంద హైస్కూల్ విద్యార్థులు ఐబీటీ మెగా ఒలింపియాడ్ రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని యాజమాన్యం ప్రసాద్, సాగర్ తెలిపారు. ఈ అభ్యాస్ అకాడమి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల్లో 4నుంచి 9వ తరగతికి చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారని తెలిపారు. బుధవారం నలంద పాఠశాల ప్రిన్సిపాల్ సాగర్, కరస్పాండెంట్ ప్రసాద్ వారి తల్లిదండ్రుల సమక్షంలో సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సబ్జెక్టు ఇన్‌చార్జీ ఉపాధ్యాయుడు సతీష్, సందీప్, శ్వేత, నిఖిల, రాజశ్రీలు పాల్గొన్నారు.

జిల్లాలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుల ఎన్నిక


గైని కిరణ్

రెంజల్,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడి ఎన్నికల ఫలితాలు బుధవారం వెలువడ్డాయి. రెంజల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రెంజల్ మండల కేంద్రానికి చెందిన గైని కిరణ్ 808ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఎన్నికకు కృషి చేసిన ఎమ్మెల్యే సుదర్శన్,కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బోధన్‌రూరల్: బోధన్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా కార్తీక్ యాదవ్, మండల అధ్యక్షుడిగా గంగోని యగ్నేష్, రెంజల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా గైని కిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని సాలూర కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు మందర్నా రవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరిని నియమించినందుకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం మరింత పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మోర్తాడ్ మండలం శెట్‌పల్లి గ్రామా నికి చెందిన అడ్వాల మనోజ్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా భారీ మెజారిటీతో ఎన్నిక య్యారు. బుధవారం ప్రక టించిన ఫలితాల మేర కు 561ఓట్ల మెజారిటీతో మనోజ్ గెలుపొందారు. ఈ సందర్భంగా గెలుపొందిన మనోజ్‌ను బాల్కొ ండ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జీ ముత్యాల సునీల్ కుమార్ మండల కాంగ్రెస్ నాయకులు ముత్యాల రాములు, పుప్పాల అశోక్, మహిపాల్‌రెడ్డి, రంజిత్, దే వే ం ద ర్ లుఅభిన ందించారు.అత్యధిక మెజారిటీతో గెలిపించిన మండల యువజన కాంగ్రెస్‌నాయ కు లకు, సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలు పుతై కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.


మనోజ్

మోస్రా: చందూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా సాయి సుమన్ రెడ్డి ఎన్నికయ్యారు. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుల ఆన్‌లైన్ ద్వారా ఎన్నిక ఆగస్టు 14తేది నుండి సెప్టెంబర్ 14వరకు జరిగిన విషయం విదితమే. బుధవారం కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ఫలితాలు తెలియపరచగా సాయి సుమన్ రెడ్డి మండల యూత్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. దీంతో పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.


సాయి సుమన్‌రెడ్డి

మోస్రా: మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుల ఆన్‌లైన్ ద్వారా ఎన్నిక ఆగస్టు 14తేది నుండి సెప్టెంబర్ 14వరకు జరిగిన విషయం విదితమే. బుధవారం కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ఫలితాలు తెలియపరచగా మోస్రా మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా షేక్.ఇంతియాజ్ గెలుపొందారు. మోస్రా మండల యూత్ అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా ఏనుగు రవీందర్ రెడ్డి వర్గం తరఫున శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు షేక్.ఇంతియాజ్ మాట్లాడుతూ తన గెలుపుకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదములు తెలిపారు.


ఇంతియాజ్

నవీపేట: మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చిన్నదొడ్డి ప్రవీణ్ కుమార్ ఎన్నికయ్యారు. ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎన్నికలలో చిన్నదొడ్డి ప్రవీణ్ కుమార్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు పార్టీ నాయకులు తెలిపారు. అలాగే మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా భీమర్తి మోహన్, ప్రధాన కార్యదర్శిగా సాయిరాంలు ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందించారు.

వర్ని: వర్ని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బుధవారం హర్ష అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు.ఏనుగు రవీందర్ రెడ్డి ప్యానల్ తరఫున హర్షబరిలో నిలిచారు. హర్ష విజయం పట్ల కాంగ్రెస్ పార్టీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.


హర్ష

మిట్టపల్లిలో హుండీని ఎత్తుకెళ్లిన దొంగలు

డిచ్‌పల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మిట్టపల్లి గ్రామ శివారులోగల శ్రీకృష్ణ మందిరం ఆలయంలోకి చొరబడి తాళం ధ్వంసం చేసిన దొంగలు నగదు ఉన్న హుండీని ఎత్తుకెళ్లినట్లు ఆలయ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిచ్‌పల్లి పోలీసులు ఆలయాన్ని సందర్శించి సీసీ కెమెరాలను బాగు చేసుకోవాలని సూచించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్మూర్ ఆర్టీసీ డిపోను సందర్శన

పెర్కిట్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ ఆర్టీసీ డిపోను నూతన ఆర్‌ఎం జోత్స్న బుధవారం సందర్శించారు. ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ రవికుమార్ ఆమెకు స్వాగతం పలికారు. మెదక్ డిప్యూటీ ఆర్‌ఎంగా విధులు నిర్వహించి నిజామాబాద్ ఆర్‌ఎంగా నియమితులయ్యారు. ఆర్టీసీ డిపోను సందర్శించిన ఆర్‌ఎం బస్టాండ్ ఆవరణ, డిపో ఆవరణలో కలియతిరిగి పరిశీలించారు. సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపోలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం సరస్వతి, శంకర్, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

టెస్కో ద్వారా చేనేత వస్త్రాలపై 40 శాతం డిస్కౌంట్

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఈనెల 9 వరకు టెస్కో ఆధ్వర్యంలో అన్ని చేనేత వస్త్రాలపై 40 శాతం డిస్కౌట్ అమ్మకాలు నిర్వహించనున్నట్లు కరీంనగర్ డీఎంవో జనార్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్‌లోని ఆర్పిరోడ్‌లోగల టెస్కో విక్రయశాలలో అన్ని చేనేత వస్త్రాలపై 40 శాతం డిస్కౌంట్‌తో అమ్మకాలు చేయడం జరుగుతుందని కొనుగోలు దారులు చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బోధన్‌రూరల్,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): సాలూర మండల సమీపంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయని రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. సమాచారం అందుకున్న 108సిబ్బంది చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆయన తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేసి విచారణ చేపడుతున్నామన్నారు.

దొంగతనం కేసులో నిందితుడికి జైలు

జక్రాన్‌పల్లి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్రాన్‌పలి తాండాలో గత ఆగస్టు నెలలో బానవత్ నరేష్ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన పడకల్ గ్రామానికి చెందిన కోనేటి నరేష్‌కు బుధవారం ఆర్మూర్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వేముల దీప్తి నిందితునికి ఐదు నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. దొంగతనానికి పాల్పడిన పడకల్ గ్రామానికి చెందిన కోనేటి నరేష్‌కు ఆర్మూర్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వేముల దీప్తి ఐదు నెలలు జైలు శిక్ష విధించారని ఎస్సై తెలిపారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా క్రీడాకారుడు

సుభాష్‌నగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారుడు శశిధర్ ఎంపి కైనట్లు నిజామాబాద్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అధ్యక్ష కార్యదర్శులు మానస గణేష్, బి.శ్యామ్‌లు తెలిపారు. కర్నాటక రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో శశిధర్ తెలంగాణ రాష్ట్ర జట్టుకు పాల్గొం టారని తెలిపారు. ఈనెల 1 నుంచి 4 వరకు ఏఎస్‌రావునగర్ హైదరా బాద్‌లో జరిగిన శిక్షణ శిబిరంలో ప్రతిభకనబర్చి తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడని తెలిపారు.

బోర్‌మోటర్ కేబుళ్ల చోరీ


స్టాటర్‌లో వైర్లను కట్ చేసి ఫ్యూజ్‌లను తొలగించిన దృశ్యం

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ యానంగుట్ట వద్ద వ్యవసాయ భూముల్లోని సుమారు వంద బోర్‌మోటర్‌ల కేబుళ్ళను గుర్తుతెలియని దొంగలు చోరీ చేశారు. బుధవారం తమ వ్యవసాయ భూముల్లో పంటకు నీరు పారించడానికి రైతులు వచ్చే సరికి స్టాటర్‌లో వైర్లను కట్ చేసి ఫ్యూజ్‌లను తొలగించి బోర్‌మోటర్ వైర్లను దొంగిలించినట్లు గుర్తించారు. పలుమార్లు దొంగలు విద్యుత్ మోటర్ల కేబుళ్ల, విద్యుత్ మోటర్‌లను సైతం ఎత్తుకొని పోయిన సంఘటనలు ఉన్నాయి. గతంలో చోరీ విద్యుత్ మోటర్‌లు, కేబుల్ వైర్లను కొనుగోలు చేసే వ్యాపారిని రైతులు పట్టుకొని పోలీసులకు అప్పగించడంతో కొన్ని రోజుల పాటు కేబుళ్ళ చోరీ తగ్గింది. తిరిగి ఈ మధ్యనే దొంగలు కేబుళ్ళ చోరీకి పాల్పడుతున్నారు. పోలీసులు దొంగలను పట్టుకొని తమకు నష్టం జరుగకుండా రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని రైతులు కోరారు.

ఎత్తొండలో మొరం తవ్వకాలను అడ్డుకోవాలి

కోటగిరి,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని ఎత్తొండ గ్రామంలో గత నాలుగు రోజులుగా అక్రమ మొరం తవ్వకాలు జరుగుతున్నాయని బీజేపీ మండల అధ్యక్షులు వేముల నవీన్ ఆరోపించారు. కోటగిరి మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎత్తొండ గ్రామంలో గుట్టను అక్రమార్కులు పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇష్టారాజ్యంగా తవ్వి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మొరం తవ్వకాలను ప్రోత్సహిస్తున్నారని ఈ విషయమై ప్రశ్నిస్తే ఎవరికైనా చెప్పుకోండి అంటూ దాబయిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులు స్పందించి మొరం అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యటన వాయిదా

నిజామాబాద్‌అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన వాయిదా పడింది. గురువారం జరగాల్సిన మంత్రి పర్యటన ఆఖరి నిమిషంలో వాయిదా పడింది. జిల్లా కేంద్రంలో అధికా రులతో సమీక్ష, వివిధ ప్రారంభోత్సవాలు, పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొనేందుకు మొదట షెడ్యూల్ విడుదల కాగా పబ్లిక్ మీటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లుకూడా చేశారు.మంత్రి పర్యటన వాయిదా పడగామళ్లీ ఎప్పుడు వచ్చేది త్వరలో వెల్లడించనున్నట్లు తెలుస్తుంది.

తాగునీటి సమస్యపై రాస్తారోకో

కోటగిరి,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): గ్రామంలో వారం రోజులుగా తాగునీటి సమస్య తలెత్తిన అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతుంది. రుద్రూరు మండలంలోని అక్బర్‌నగర్ గ్రామంలో బుధవారం గ్రామస్థులు రుద్రూరు, వర్ని ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. ప్రధానరహదారిపై ముళ్ల కంపలు, ద్విచక్ర వాహనాలు అడ్డంగా పెట్టి పెద్ద ఎత్తున రాస్తారోకో చేశారు. రోడ్డుపై బైఠాయించి అధికారులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో వారం రోజుల నుండి తాగునీటి సమస్య తలెత్తిన పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదన్నారు. తాగునీటి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసి ఫలితం లేకుండా పోయింది. మండల ప్రత్యేక అధికారి సంతోష్ సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు రాస్తారోకోను విరమించారు.

శిథిలావస్థలో జూనియర్ కళాశాల

కళాశాల ఆవరణలో చెట్ల కిందే చదువుకుంటున్న విద్యార్థులు





వరండాలో చదువుకుంటున్న విద్యార్థులు



జూనియర్ కళాశాల గోడలకు పాకురుపట్టిన దృశ్యం

- పిప్రి బాలుర కళాశాలలో పగిలిన రేకులు, విరిగిన కిటికీలు
- వరండాల్లో , చెట్ల కింద కొనసాగుతున్న చదువులు
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పిప్రి రోడ్డులో బాలుర జూనియర్ కళాశాల శిథిలావస్థకు చేరింది. 1965 అక్టోబర్ 19న ఉమ్మడి రాష్ట్రంలో నాటి రెవెన్యూ శాఖ మంత్రి ఎస్.రాంచంద్రారెడ్డి సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలకు భూమిపూజ చేసి కళాశాలను ప్రారంభించగా అప్పటి నుంచి ఇంటర్, డిగ్రీ కళాశాలలో కలిసి ఉండేవి. సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలుగా ఎందరో విద్యాభ్యాసాన్ని పొంది మంచి స్థానాల్లో స్థిరపడ్డారు. గడిచిన కొన్నాళ్ల తర్వాత సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలు విడిపోయి 1996లో ఇంటర్ కళాశాల, డిగ్రీ కళాశాలలుగా ఏర్పడ్డాయి. తదనంతరం డిగ్రీకళాశాలకు నూతన భవంతిని నిర్మించగా ఇంటర్ కళాశాల మాత్రం పట్టించుకునే నాథుడు లేక పాత భవంతిలో కొనసాగుతుంది. ఒకప్పుడు ఇంటర్ కళాశాలలో సీటు పొందాలంటే విద్యార్థులు నానా అవస్థలు పొందేవారు. గడిచిన కాలానుగుణంగా ఇంటర్‌లో విద్యానభ్యాసించడానికి కళాశాలలో సీటు సమస్యలు లేవు. కానీ పాత భవనం కారణంగా విద్యార్థులు వెనుకడుగు వేస్తున్నారు. ఇదే కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసించిన వారు ఎందరో ఉన్నత ఉద్యోగంలో ఉండగా మరికొందరు రాజకీయాల్లో ఉన్నత పదవుల్లో ఉన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ హాస్టళ్లలో ఉండి ఇంటర్ అదే కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. కళాశాలలో హెచ్ఈసీ, సీఈసీ, ఎంపీసీ బైపీసీ కోర్సులు ఉండగా సుమారు 300మంది విద్యార్థులను విద్యను అభ్యసిస్తుండగా పాత కట్టడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోడలకు పాకురు పట్టి ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితుల్లో భవనం ఉండగా కొన్ని క్లాసు రూం లో పైన రేకులు పగిలిపోయి కిటికీల డోర్‌లు విరిగిపోయాయి. అలాగే కళాశాల చుట్టూ చెట్ల పొదలు ఏపుగా పెరిగి విద్యార్థులకు దోమల బెడద ఎక్కువైంది.. దీంతో విద్యార్థులకు కళాశాల వరండాల్లో, చెట్ల కింద చదువును కొనసాగిస్తున్నారు. ఎప్పుడు ఏ విషపురుగు గాని, పాములు గాని క్లాసురూంలోకి వస్తాయోనని భయభ్రాంతులకు గురవుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం..

● విజయేందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్



జూనియర్ కళాశాల స్థితిగతులపై నూతన భవనం నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు కాగానే పాత భవనానికి మరమ్మతులు లేదా నూతన భవన నిర్మాణం చేపట్టి విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తాం.



కళాశాలలో పైకప్పు రేకులు విరిగిన దృశ్యం



విరిగిన కిటికీలు

రాష్ట్రస్థాయిలో క్రీడాకారులు ప్రతిభ చాటాలి

● సుద్దపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నళిని

డిచ్‌పల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి మహిళల బేస్‌బాల్ పోటీలో క్రీడాకారులు చక్కని ప్రతిభ కనబర్చాలని సుద్దపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నళిని అన్నారు. బుధవారం జిల్లా బేస్‌బాల్ జట్టు ఎంపిక కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ నెల 7 నుంచి 9 వరకు రాష్ట్రస్థాయి బేస్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు జరుగనున్నాయని ఈ పోటీలో జిల్లా జట్టు మంచి ప్రతిభ కనబర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు జ్యోత్స్న, శ్రీలత, కోచ్ మౌనిక పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి బేస్‌బాల్ చాంపియన్ షిప్‌కు ఎంపికైన క్రీడాకారులు వీరే

వాలీబాల్ క్రీడల్లో సత్తా చాటిన బాల్కొండ క్రీడాకారులు

ముప్కాల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజుల క్రితం జిల్లా స్థాయి ఇంటిగ్రేటెడ్ హాస్టల్ విద్యార్థులకు బోధన్‌లో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో బాల్కొండ ఉన్నత పాఠశాల హాస్టల్ విద్యార్థిని విజేతలుగా నిలిచినట్లు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. బుధవారం బాల్కొండ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు ఎంఈవో రాజేశ్వర్ అభినందించారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి రాణించడంతో పాఠశాలకు మరింత పేరు తీసుకురావాలని క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



బాల్కొండలో క్రీడాకారులను అభినందిస్తున్న ఎంఈవో రాజేశ్వర్

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన జిల్లా బాలబాలికల జట్టు

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా బాలబాలికల జట్లను బుధవారం మగ్గిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎంపిక చేశారు. ఎంపిక పోటీలకు 60 మంది బాలురు, 25మంది బాలికలు వివిధ జూనియర్ కళాశాలల తరఫున పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ చూపిన 12మంది బాలికలు, 12మంది బాలురను జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 వాలీబాల్ జట్లకు ఎంపిక చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు హరిత, వ్యాయమ ఉపాధ్యాయుడు మధు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 10నుంచి మహబూబ్‌నగర్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసో సియేషన్ కార్యదర్శి గంగారెడ్డి, రాజ్ కుమార్, యాదగిరి, శ్రీనివాస్, అనుష, నిఖిత, రాజేందర్, భూపతి, సురేష్ పాల్గొన్నారు.



భీమ్‌గల్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో స్వామి

విద్యార్థులకు క్రీడా పోటీలు

భీమ్‌గల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం, ఇన్‌చార్జీ ఎంఈవో స్వామి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింబాద్రి, రఘువాస్, వాసుదేవ్, శివ, మురళీ, రాములు, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు ఇప్పించండి

- మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుల ఆవేదన
- పట్టించుకోని పాలకులు, అధికారులు



మోపాల్‌లో మధ్యాహ్న భోజనం వండుతున్న నిర్వాహకులు

మోపాల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులకు ఆరు నెలల నుంచి బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో కూడా సరైన సమయంలో బిల్లులు రాకపోవడంతో కొంత మంది ఏజెన్సీలను మాని వేసుకున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పిల్లలకు మాత్రం మధ్యాహ్న భోజనాన్ని వండి పెడుతున్నామని వారు పేర్కొన్నారు. తమకు ఎన్ని ఇబ్బందులున్నా మధ్యాహ్న భోజనాన్ని మాత్రం ఆపడం లేదన్నారు. విద్యార్థులకు మంచి ఆహారాన్ని అందిస్తున్నామన్నారు. సరైన సమయంలో బిల్లులు రాకపోవడంతో కొంత మంది ఏజెన్సీ నిర్వాహకులు వాటిని మూసి వేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. మరికొంత మంది బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి ఏజెన్సీలను నడుపుతున్నామని తెలిపారు. మోపాల్ మండలంలో 21 గ్రామ పంచాయతీలు ఉండగా కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలు, మరికొన్ని గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఒక్కోక్క పాఠశాలలో 50 నుంచి 100కు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇదిలా ఉండగా బోర్గాం(పి), ముదక్‌పల్లి, మంచిప్ప, మోపాల్, బాడ్సి, న్యాల్‌కల్, కులాస్‌పూర్ జెడ్పీ హెచ్ఎస్‌లో అనేక మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికీ తాము మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నామని తెలిపారు. తమ బిల్లుల విషయంలో ఉన్నతాధి కారుల దృష్టికి కూడా తీసుకొచ్చామని పలు ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను అర్థం చేసుకొని తమ బిల్లులను తొందరగా వచ్చే విధంగా చూడాలని కోరారు. ఇదిలా వుండగా మండలంలోని కొన్ని గ్రామాల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్న వారికి గ్యాస్ పొయ్యి లేకపోవడంతో కట్టెల పొయ్యి మీద వంట చేస్తున్నారు. వీరి దీన గాథ వింటేనే అనేక మంది చలించిపోవాల్సి వస్తుంది. వర్షాకాలంలో వీరు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. పాలకులు, అధికారులు ఎన్నో సార్లు ప్రభుత్వ పాఠశాలలను తనిఖీలు చేస్తుంటారు. కానీ మేము ఎదుర్కొంటున్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు గ్యాస్ పొయ్యి, సిలిండర్‌లను సరఫరా చేసే విధంగా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఇసుక అక్రమ డంపుల నిల్వాలపై చర్యలేవీ?

- ఎడపల్లిలో భారీగా ఇసుక అక్రమ డంపుల నిల్వలు
- చోద్యం చూస్తున్న అధికారులు

ఎడపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్ని ప్రభుత్వాలు మారినా అక్రమ వ్యాపారస్థుల ఆగడాలకు అడ్డూ, అదుపు లేకుండా పోయాయి. ఒకవైపు ప్రభుత్వం ఎన్నో నిబంధనల మధ్య ఇసుక అనుమతులు ఇస్తున్నా, అక్రమ ముసుగులో ఇసుక వ్యాపారం చేస్తున్న వారి ఆటలు సాఫీగా సాగుతున్నాయనడానికి ఎడపల్లి మండలంలోని పలుచోట్ల భారీగా పేరుకుపోయిన ఇసుక డంపులే నిదర్శనం. ఎడపల్లి మండలంలో గత కొంతకాలంగా కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసుకుని అక్కడ బోధన్ ప్రాంతం నుంచి వాగులు, వంకల నుంచి దొంగచాటున ఇసుకను రవాణా చేస్తూ డంపులలో నిల్వ చేస్తున్నారు. ఏమని ప్రశ్నించిన వారికి ఇళ్ల నిర్మాణాల కోసం ఇసుకను తరలించామనే సాకుతో తప్పించుకుంటున్నారు. ఇందుకు ముఖ్య కారణం అటు నిజామాబాద్, బోధన్ ప్రధాన రహదారిలో అతి సమీపంలో ఈ మండలం ఉండడం ఈ అక్రమ ఇసుక వ్యాపారస్థులకు కాసుల పంట కురిపిస్తుంది.

● గుట్టుగా కొనసాగుతున్న మామూళ్ల దందా

ఎడపల్లి మండలంలోని ఈ అక్రమ ఇసుక డంపుల వ్యాపారాన్ని కొందరు రాజకీయ నేతల అండదండలతో సాఫీగా సాగిస్తున్న ఈ వ్యాపారస్థులు నెలనెలా అటు సంబంధిత శాఖ అధికారులను ఇటు పోలీసులను మచ్చిక చేసుకుని వారి చేతులు తడిపి తమ అక్రమ వ్యాపారాన్ని మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్న చందంగా కొనసాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

● సామాన్యుడికి భారంగా ఇసుక

సొంతగూడు నిర్మించుకోవాలనే కల నెరవేర్చుకునే క్రమంలో ఇంటి నిర్మాణం చేపట్టిన సామాన్య ప్రజలకు ఇసుక రవాణా భారంగా మారింది. అధిక ధర చెల్లించి దళారుల నుంచి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇదే ఈఅక్రమ ఇసుక వ్యాపారులకు కలిసోచ్చినట్లు అయ్యింది. ఇప్పటికైనా మండలంలోని ప్రధాన రహదారి పక్కన పలు చోట్ల ఉన్న ఇసుక డంపులను స్వాధీనం చేసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా అక్కడక్కడా పలుచోట్ల పలుసార్లు అధికారులు పట్టుకున్న ఇసుక డంపులను, టిప్పర్‌లను రాజకీయ నేతల ఒత్తిడితో తూతూ మంత్రంగా నామమాత్రపు జరిమానా విధించి ఇసుకతో సహా టిప్పర్‌లను వదిలివేస్తున్నారు.



ఎడపల్లిలో నిల్వ చేసిన ఇసుక డంపులు



పోలీసులు పట్టుకున్న ఇసుక టిప్పర్ (ఫైల్)

ఇందిరమ్మ ఇళ్ల పథకం అర్హుల ఎంపికకు సన్నద్ధం

(ఐదో పేజీ తరువాయి)

లక్షల్లో ఇళ్లను నిర్మాణం చేసేందుకు సిద్ధం కావడంతో జిల్లాలో మళ్లీ కొత్తగా గృహ నిర్మాణ శాఖను ఏర్పాటు చేసింది. ఇప్పటికే ఈ శాఖకు ప్రాజెక్టు డైరెక్టర్‌తో పాటు కావాల్సిన ఇంజనీరింగ్ సిబ్బందిని నియామకం చేస్తుంది. పూర్తిస్థాయిలో అన్ని మండలాల పరిధిలో పనిచేసే విధంగా గతంలో ఇతర శాఖలకు కేటాయించిన గృహ నిర్మాణ శాఖల అధికారులను తిరిగి శాఖలోకి తీసుకువచ్చే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కోసం యాప్‌ను విడుదల చేయగానే ఎంపిక ప్రక్రియ మొదలు పెడతామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. యాప్‌లో ఉన్న వివరాలను పరిశీలించడంతో పాటు గ్రామాల వారీగా అర్హులైన వారిని ఎంపిక చేయనున్నామని ఆయన తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం వారికి ఇళ్లను మంజూరు చేయడంతో పాటు పూర్తిస్థాయిలో నిర్మాణం అయ్యే విధంగా పర్యవేక్షిస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు మండలాల వారిగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు.

హామీలను అమలు చేసే వరకూ కాంగ్రెస్ వెంట పడతాం..

(ఐదో పేజీ తరువాయి)

మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిందన్నారు. నెలకు రూ.2500 చొప్పున రూ.30వేలు ఒక్కో మహిళకు సీఎం బాకీ ఉన్నారని అన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేసినప్పుడే తెలంగాణ తల్లికి నిజమైన నివాళులు అర్పించిన వారు అవుతారని స్పష్టం చేశారు. తెలంగాణ తల్లి రూపురేఖలు మార్పు పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి మళ్లింపు రాజకీయాలు చేస్తుందన్నారు. ప్రజల పట్ల ప్రేమపూర్వకంగా వ్యవహరించడం ప్రజాసమస్యలపై ప్రశ్నించడమే తెలంగాణ సంస్కృతి అన్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు నాగార్జున సాగర్ ప్రాజెక్టు తెలంగాణ చేతిలో ఉండేదని ప్రస్తుతం కేంద్ర బలగాలు మోహరించాయని అన్నారు. నిజంగా ధైర్యం ఉంటే నాగార్జున సాగర్ వద్ద నరసింహ అవతారం ఎత్తి కేంద్ర బలగాలను వెనక్కి పంపించి మన నీళ్ల వాటాను మనకు తీసుకురావాలని సవాల్ చేశారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరలించుకుపోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా వస్తున్న సామాజిక మార్పులను పరిగణలోకి తీసుకొని బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం అంశాన్ని తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు నవీనాచారి, అవంతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పూర్తయినా.. హామీలను నెరవేర్చని కాంగ్రెస్

(ఐదో పేజీ తరువాయి)

నిర్వహిస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో వరంగల్, కొత్తగూడెం, రామగుండెం, ఆదిలాబాద్‌లో కొత్త ఎయిర్‌పోర్టులను నిర్మించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. జిల్లాకు చెందిన జక్రాన్‌పల్లిని మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. జిల్లాలో రెండులక్షల ఎకరాలకు పైగా సాగునీరు అందించే ప్రాణహిత చేవెళ్ల ప్యాకేజీ పనులను పట్టించుకోలేదన్నారు. కాళేశ్వరం పథకం కింద ఉన్న ఈ పథకాలకు సంవత్సరం కాలంగా నిధులను విడుదల చేయకపోవడం వల్ల పనులు నిలిచిపోయాయని అన్నారు. ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం లక్ష రూపాయల ఆర్థిక సహాయంతో పాటు తులం బంగారం అందిస్తామని చెప్పారని అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గోపిడి స్రవంతిరెడ్డి, గద్దె భూమన్న, కిశోర్, బద్దం కిషన్, స్వామియాదవ్, పద్మారెడ్డి పాల్గొన్నారు.

పుష్ప సినిమాలో చూపించేదంతా కల్పితం..

పుష్ప సినిమాలో చూపించేదంతా కల్పితం అని గందపు చెక్కలకు అంత ధర ఉండదని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. తాను లైసెన్సు ఉన్న ఎర్రచందనం వ్యాపారినని ఆయన తెలిపారు. ఎర్రచందనం ధర పది లక్షలు ఉంటే సినిమాలో కోటి రూపాయలు చూపిస్తున్నారని అన్నారు. ఈ సినిమా చూసిన తర్వాత అటవీ ప్రాంతంలో వేల ఎర్రచందనం చెట్లను నరికివేశారని ఆయన అన్నారు. ఈ సినిమాపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పందించాలని ఆయన కోరారు. ఈ సినిమా కోసం టికెట్ ధరలను అమాంతం పెంచడం సరికాదన్నారు.

హిందువులు సంఘటితంగా పోరాడాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమస్య వచ్చినప్పుడు హిందువులంతా సంఘటితంగా పోరాడినప్పుడే సమస్యలు అధిగమించవచ్చని బంగ్లాదేశ్‌లోని హిందువుల రక్షణకై మనమంతా కలిసికట్టుగా పోరాడినప్పుడే హిందువులను రక్షించగలుగుతామని విశ్వహిందూ పరిషత్ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మల సత్యంజి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ధర్నాచౌక్‌లో బంగ్లాదేశ్ హిందువుల రక్షణకై హిందు ఐక్యవేదిక ఇందూరు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంఘీభావం సభకు ఆయన ముఖ్యవక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాలపై హిందువులపై బంగ్లాదేశ్ చూపుతున్న వివక్షత ప్రపంచమంతా చూస్తుందని అన్నారు. ఇస్కాన్ ప్రభూజి అరెస్టు విషయంలో బంగ్లాదేశ్ చర్యలను ఖండిస్తూ ప్రభుత్వం ప్రభూజిని విడుదల చేసే విధంగా చూడాలని అన్నారు. రానున్న కాలంలో మన భారతదేశంలో ఉన్న హిందువులంతా సంఘటితంగా లేకపోతే ఇటువంటి పరిణామాలు చోటుచేసుకుంటాయని అన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ బంగ్లాదేశ్ మనదేశంతో పోలిస్తే చాలా చిన్నదైన దేశం అని భారతదేశ ప్రజలంతా ఐక్యంగా ఒక్కసారిగా కలిసి కట్టుగా పిలుపునిస్తే బంగ్లాదేశ్ ప్రపంచంలో స్థానం కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ స్వ యం సేవక్ జిల్లా సంఘ్ చాలక్ గురుచరణ్, మల్లారం పిట్లకృష్ణ మహారాజ్, కంఠేశ్వర్ ఇస్కాన్ శాఖ రామానంద్ రాయ్ ప్రభూజీ, విశ్వహిందుపరిషత్ జిల్లా అధ్యక్షుడు దినేష్ ఠాకూర్, హిందువాహిని సాయిప్రసాద్, ఏబీవీపీ విభాగ్ ప్రముఖ్ నరేష్, బాజాపా జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, బాజాపా జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, బాజాపా ఎస్సీ మోర్చ అధ్యక్షుడు శివకుమార్, బాజాపా అధికార ప్రతినిధి శంకర్, విశ్వహిందూ పరిషత్ విభాగ్ ప్రముఖ్, కృష్ణ, కార్యదర్శి దయానంద్, జిల్లా ఉపాధ్యక్షులు ఆనంద్, కోశాధికారి శేఖర్, సహకార్యదర్శి రమేష్, హిందువాహిని జిల్లా అధ్యక్షుడు అనిల్, నగర అధ్యక్షుడు హిందు ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సిర్పూర్‌లో మాజీ ఎంపీపీ భర్తపై దాడి

నిజామాబాద్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగర శివారులో గల సిర్పూర్ గ్రామంలో నిజామాబాద్ మాజీ ఎంపీపీ భర్త గంగారెడ్డిపై దాడి జరిగింది. బొడ్డు గంగారెడ్డి తన పొలం కౌలుదారు గుండునాయక్‌తో కలిసి తన భూమిని కొందరు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని బుధవారం నిజామాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అదనపు కమిషనర్‌కు నిజామాబాద్ ఏసీపీకి ఫిర్యాదు చేసిన తర్వాత తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిన గంగారెడ్డి డ్రైవర్ శుభంలపై కర్రలు, రాడ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగ జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. కౌలు చేస్తున్న గుండు నాయక్ అనే గిరిజనుడి పంటను కొందరు ధ్వంసం చేశారు. ఈ విషయంపై మోపాల్ పోలీసు స్టేషన్‌లో మూ డు నెలల క్రితం ఫిర్యాదు చేశారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు దాడి కేసు నమోదు అయ్యింది. ఇప్పటి వరకు బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. సంబంధిత కేసు పెండింగ్‌లో ఉండగానే అక్కడ భూవివాదంలో మరోసారి దాడి జరుగడం కలకలం రేపింది.



గాయపడిన గంగారెడ్డి

రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే..

● నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



సుద్దపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఏడాది పాలనలో రైతులకు రెండులక్షల రుణమాఫీ, 500 బోనస్ ఇవ్వడం భారతదేశ చరిత్రలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం స్వర్ణ అక్షరాలతో లిఖించదగిందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. ప్రజాపాలనలో రైతులు పండుగ చేసుకుంటే చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. బుధవారం డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో గ్రంథాలయంకు ఇచ్చిన సామాగ్రిని అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ యేడాది కాలంలో రుణమాఫీ, బోనస్‌తో పాటు 60వేల మందికి ఉద్యోగాలు కల్పించడం రేవంత్ సర్కార్ ఘన విజయం అన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా జాబ్‌క్యాలెండర్ విడుదల చేసినట్లు కృషి చేశారు. పదేళ్ల భారస హయాంలో కాళేశ్వరం పథకం ద్వారా సాగునీరు చుక్క నీరు రాలేదన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో నిరంతరం ఉచిత విద్యుత్ ఇవ్వడంతో పాటు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రాణహిత చేవెళ్ల పథకం ద్వారా రానున్న రెండేళ్లలో సుద్దపల్లి గ్రామానికి సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. త్వరలోనే డిచ్‌పల్లిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల రానుందని జిల్లాలోనే డిచ్‌పల్లిని ఎడ్యుకేషన్ హబ్‌గా ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన వారందరికి అందిస్తామని పేర్కొన్నారు. విభజన బిల్లు అమలు చేయకుండా ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణపై వివక్ష చూపుతున్నారని అన్నారు. రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర సమితి కలిసి పనిచేస్తున్నాయని ఆయన ఎద్దేవ చేశారు. నిజామాబాద్ గ్రామీణ రూరల్ నియోజకవర్గానికి తెలంగాణలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. సుద్దపల్లి గ్రంథాలయంలో విద్యాభ్యాసం చేసిన 13 మంది ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన సన్మానించారు. త్వరలోనే సుద్దపల్లి గ్రంథాలయంలో వైఫై ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, పార్టీ ప్రతినిధులు అమృతాపూర్ గంగాధర్, కంచెట్టి గంగాధర్, శేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ముల్లంగి నర్సయ్య, ముల్లంగి అంజయ్య, ధర్మాగౌడ్, వాసుబాబు, కమ్మరి గంగారాం, సుబ్బయ్య, శ్యామ్‌సన్, వినోద్‌రెడ్డి, రమణాచారి, దేవకరుణ, న్యాసరాజేశ్వర్, సుద్దపల్లి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో వనదర్శిని కార్యక్రమం

సుభాష్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ ఉత్తర మండల అటవీశాఖ ఆధ్వర్యంలో బుధవారం వనదర్శిని కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని సారంగపూర్ అర్బన్ పార్క్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వనదర్శిని కార్యక్రమానికి నగరంలోని సెయింట్ జేవియర్స్ హైస్కూల్ విద్యార్థులు హాజరయ్యారు. అర్బన్ పార్క్‌లో గల మొక్కలు, జంతువుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అటవీ రక్షణ యొక్క ప్రాధాన్యతపై విద్యార్థులకు వివరించారు. అడవుల్లో నిప్పు పెట్టకుండా చేపట్టే చర్యలను అటవీశాఖ అధికారులు విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. అటవీ సంరక్షణ బాధ్యత అందరిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌వో సంజయ్ గౌడ్, అటవీశాఖ అధికారులు ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.



మంచిప్ప అటవీలో ఫారెస్టు అధికారుల వన దర్శిని నిర్వహిస్తున్న దృశ్యం

మోపాల్: ప్రజాపాలనలో భాగంగా ఫారెస్టు అధికారులు బుధవారం మండలంలోని ముదక్‌పల్లి అటవీ ప్రాంతంలో ఫారెస్టు రేంజ్ అధికారి రాధిక ఆధ్వర్యంలో వన దర్శిని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులను ఫారెస్టులోకి తీసుకెళ్లి వివిధ రకాల చెట్లను, వాటి యొక్క ఉపయోగాలు ఏంటి, పర్యావరణ సమతుల్యానికి వన్యమృగాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వన్యమృగ సంరక్షణ చట్టం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అటవీ ప్రాంతంలో వన్యమృగాలను సంరక్షించడానికి, నీటి అవసరాలను తీర్చడానికి నిర్మించిన చెక్ డ్యామ్‌ల ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవాలన్నారు. భవిష్యత్తు తరంలో అటవీ సంపద సంరక్షించుకోవడానికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వెంకట్రామ్, ఉపాధ్యాయులు సాయిలు, దేవేందర్, జైభారత్ యూత్ అధ్యక్షుడు సాయిరాం, ఫారెస్టు సెక్షన్ అధికారి సాయికుమార్, బీట్ ఆఫీసర్లు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

7న జరిగే రాష్ట్ర ఆటో, టాక్సీ బంద్‌ను జయప్రదం చేయండి

సుభాష్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటో, క్యాబ్ డ్రైవర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి డిసెంబరు 7న జరిగే ఆటో,టాక్సీ, వ్యాన్, క్యాబ్‌ల రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో, టాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు ఇచ్చిన హామీల అమలుపై తెలంగాణ రాష్ట వ్యాప్తంగా బంద్ ప్రకటిస్తున్నట్లు తెలిపారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వం ఆటో మీటర్ చార్జీలు, ఇతర జిల్లాల ఆటోలు హైదరాబాద్ నగరంలోకి రాకుండా నిషేధించడంలో విఫలమైందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల మేనిఫెస్టోలో సంవత్సరానికి 12వేలు ఇస్తామని ప్రకటించడం జరిగిందన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయక పోగా మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్లందరికి జీవనోపాధిపై పెద్ద దెబ్బ తగిలిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆటో చార్జీలను పెం చాలని డిమాండ్ చేశారు. అంతకుముందు బంద్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కటారి రాములు, అబ్దుల్ ముజీబ్, సయ్యద్ రఫీయుద్దీన్, కిషన్, ఉదయ్, విఠల్, ఎం.బాలాజీ, ప్రసాద్, రఫీక్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు కార్యదర్శి నూర్జహాన్

కోటగిరి: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 2019మోటార్ వాహన చట్టాన్ని రద్దు చేసి ఆటో డ్రైవర్లను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ డిమాండ్ చేశారు. రుద్రూరు మండల కేంద్రంలో బుధవారం ఆటో డ్రైవర్లతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్ల జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. ఆటో డ్రైవర్లకు ఏడాది 15వేలు ఇస్తామని చెప్పిన హామీని అమలు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 7 వ తేదిన ఆటో యూనియన్ జేఏసీ తలపెట్టిన ఆటోల బంద్ జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు సలీం, అంజయ్య, ఫక్రు, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా విపుల్‌గౌడ్

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నరాల నిహార్

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది కాలంగా ఎదురు చూస్తున్న యువజన కాంగ్రెస్ ఎన్నికల ఫలితాలు బుధవారం విడుదల అయ్యాయి. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా విపుల్‌గౌడ్ గెలుపొందారు. ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను, నియోజకవర్గ అధ్యక్షులు, మండల అధ్యక్షులకు ఓట్లు వేశారు. జిల్లా వ్యాప్తంగా 40వేలకు పైగా ఓట్లు నమోదు అయ్యాయి. నవంబర్ 15 నుంచి నవంబర్ 21 వరకు ఎన్నికలు నిర్వహించారు. జిల్లాలో హోరా హోరీగా యువజన కాంగ్రెస్ ఎన్నికలు జరిగాయి. జిల్లా అధ్యక్ష పదవి కోసం విపుల్‌గౌడ్, అబ్దుల్ అద్నాన్, సాయికిరణ్, శ్రీకాంత్, నరేష్, నాగేంద్రబాబులు పోటీ పడ్డారు. విపుల్‌గౌడ్, నాగేంద్రబాబుల మధ్య తీవ్ర పోటీ నెలకొనగా విపుల్‌గౌడ్ గెలుపొందారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ ఇర్ఫాన్ గెలుపొందారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి కోసం జిల్లాకు చెందిన నరాల నిహార్, విక్కీయాదవ్‌లు పోటీ చేయగా ఓపెన్ కేటగిరిలో 21వేల 406 ఓట్లు సాధించి నరాల నిహార్ గెలుపొందగా విక్కీయాదవ్ సైతం గెలుపొందారు. నియోజకవర్గ అధ్యక్షులతో పాటు మండల అధ్యక్షులు కూడా గెలుపొందినట్లు ప్రకటించారు. విపుల్‌గౌడ్ ఇదివరకు ఎన్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.



విపుల్‌గౌడ్



మహమ్మద్ ఇర్ఫాన్



నరాల నిహార్

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలుకెళ్లిన అంబులెన్స్ డ్రైవర్

ఖిల్లా, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి):మద్యం సేవించి అంబులెన్స్ నడుపడమే కాకుండా రోడ్డుపై న్యూసెన్స్ చేసిన అంబులెన్స్ డ్రైవర్‌కు కోర్టు మూడు రోజుల జైలు శిక్ష మరో 14మందికి రూ.38వేలు జరిమాన విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.ప్రసాద్ తెలిపారు. ఈనెల 2న నగరంలోని నిఖిల్‌సాయి చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం సేవించి అంబులెన్స్‌ను నడిపిన డ్రైవర్ ఇసాఖ్‌ను అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు. డ్రైవర్‌తో పాటు మరో 14మందిని బ్రీతింగ్ అనలైజర్‌తో పరిశీలించగా వారు మద్యం సేవించి ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం కోర్టు ఎదుట హాజరు పర్చడం జరిగిందన్నారు. వీరికి రెండవ శ్రేణి మెజిస్ట్రేట్ అహ్మద్‌మోయిద్దీన్ అంబులెన్స్ డ్రైవర్‌కు మూడు రోజుల జైలు శిక్ష, మరో 14మందికి రూ.38వేలు జరిమాన విధించినట్లు చెప్పారు.

● మద్యం తాగి ఇబ్బందులకు గురి చేసిన వ్యక్తికి ఏడు రోజుల జైలు

మద్యం సేవించి ఇతరులను ఇబ్బందులకు గురి చేసిన బోర్గాం (పి)గ్రామానికి చెందిన శ్రీధర్ అనే వ్యక్తికి ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ రెండవ క్లాస్ మెజిస్ట్రేట్ అహ్మద్‌మోయినోద్దీన్ తీర్పు చెప్పినట్లు నాలుగో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో బోర్గాం గ్రామానికి చెందిన శ్రీధర్ గత కొన్ని రోజులుగా మద్యం తాగుతూ చుట్టుపక్కల వారికి, కుటుంబసభ్యులకు ఇబ్బందులను కలిగించే విధంగా ప్రవర్తిస్తుండగా శ్రీధర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. శ్రీధర్‌ను రెండవ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా రెండవ క్లాస్ మెజిస్ట్రేట్ ఏడు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంబంలో కొనసాగుతున్న గజ్జెలమ్మ జాతర ఉత్సవాలు

కోటగిరి,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండలంలోని అంబం(ఆర్)గ్రామంలో బుధవారం గజ్జెలమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగాయి. పోతరాజుల విన్యాసాల మధ్య గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించారు. పాడిపంటలు సుభిక్షంగా పండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ నాయకులు రాములు, గంగారాం, హన్మాండ్లు, నాగనాథ్, భూమయ్య పాల్గొన్నారు.



రథాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

ఆధునిక హంగులతో ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

● అత్యాధునిక సౌకర్యాలతో చిత్ర ప్రదర్శన
● పూజలు నిర్వహించిన యజమాన్యం



థియేటర్‌లో పూజలు నిర్వహిస్తున్న ఉషాప్రసాద్

ఖిల్లా, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రంలోని ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్‌లో అత్యాధిక హంగులతో చిత్రప్రదర్శణ కోసం స్ర్కీన్-2,స్ర్కీన్-1లను ముస్తాబు చేశామని ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్ యజమానురాలు ఉషాప్రసాద్ తెలిపారు. బుధవారం సాయంత్రం స్ర్కీన్-2లో పూజకార్యక్రమాలను తన కుటుంబసభ్యులతో కలిసి నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. గతంలో ఉన్న వాటికి భిన్నంగా విఐపి (లగ్జరీ సీట్లను), అటానమస్ సౌండ్ సిస్టంతో పాటు హాల్‌లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గురువారం విడుదల అవుతున్న పుష్ప-2 చిత్రం నుంచి ప్రేక్షకులకు కొత్త అనుభూతి కలిగే విధంగా తీర్చిదిద్దామని తెలిపారు. ప్రేక్షకులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. ప్రేక్షకులకు మెరుగైన సేవలు అందించేందుకే గతంలో ఉన్న స్ర్కీన్‌లను కొత్తగా రూపొందించామన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వినతి

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నాల్గవ డివిజన్ పరిధిలోని మాధవనగర్ నర్సన్న కాలనీ వాసులకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని తెలంగాణ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిజామాబాద్ ఆర్‌డీవోకు వినతిపత్రం అందజేశారు. గత 25 ఏళ్లుగా ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా ఇప్పటికీ ఇళ్ల పట్టాలు ఇవ్వడం లేదని ఇప్పటికైనా ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవీందర్, మారుతి, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ

ఖిల్లా, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి):అవినీతి నిరోదక శాఖ వారోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 11గంటలకు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో ర్యాలీ నిర్వహించనున్నట్లు అవినీతి నిరోదక శాఖ డిఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు. ఈ ర్యాలీ పాత కలెక్టరేట్ మైదానం నుంచి తిలక్‌గార్డెన్, ఆర్టీసీ బస్‌స్టాండ్, దేవిరోడ్డు చౌరస్తా, గాంధీచౌక్, నెహ్రూపార్క్ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీకి ముఖ్యఅతిథిగా ఇంచార్జీ పోలీసు కమీషనర్ సింధుశర్మ హాజరయి జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తారన్నారు. అవినీతి నిర్మూలన ప్రజల బాధ్యత గురించి వివరిస్తారన్నారు.వారోత్సవాల్లో భాగంగా ఈనెల 9వ తేది వరకు ప్రతి రోజు వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

నేడు జిల్లాకు బీసీ డెడికేటెడ్ కమిషన్ రాక

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ స్థానిక సంస్థల వారిగా కల్పించవల్సిన అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో ఆసక్తి కలిగిన బీసీ కులసంఘాలు, ప్రజాప్రతినిధులు, ఇతర కుల సంఘాలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను స్వీకరించడానికి గురువారం జిల్లా కేంద్రానికి బీసీ డెడికేటెడ్ కమీషన్ వస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. గురువారం ఉదయం 11.30ల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బీసీ డెడికేటెడ్ కమీషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వర్‌రావు రిటైర్డ్ ఐఏఎస్, కార్యదర్శి బి.సైదులు ఐఎఫ్‌ఎస్‌లు ప్రజాభిప్రాయ సేకరణ జరుపనున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఆయా కులాల స్థితిగతులపై డెడికేటెడ్ కమీషన్‌కు వివిధ సంఘాల వారు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చునని సూచించారు. అభిప్రాయాలు తెలియజేసేవారు తమ వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, ఆధారాలను, సాక్షాలను వారి అభ్యర్థనలతో సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

నవీపేట మండలంలో అకాల వర్షం

నవీపేట,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): నవీపేట మండలంలో బుధవారం అకాల వర్షం కురిసింది. మధ్యాహ్నం సమయంలో వాతావరణంలో మార్పులు జరిగి కాల వర్షం కురియడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వానాకాలం ధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తి కావడంతో ఎటువంటి నష్టం జరగలేదని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ

ఎడపల్లి,డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):నేడుఎడ పల్లి మండల కేంద్రంలో 2023-24సంకాలంలో ఉపాధి హామీ పథకంలో చే పట్టిన పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు బుధవారం ఎడపల్లి మండల అభివృద్ధి అధికారి శంకర్ తెలిపారు. సామాజిక తనిఖీ నిర్వహించారని, నేడు మండల స్థా యిలో ప్రజావేదిక ఉందన్నారు.



చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.115	రూ.160	రూ. 185
వెన్‌కాబ్(కిలో)	రూ.120	రూ.170	రూ. 190



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.79200	రూ.73000	రూ.950

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్ర్కీన్-1 : పుష్ప-2 (6.10, 10.15, 2.20, 6.25, 10.30)
స్ర్కీన్-2 : పుష్ప-2 (5.25, 9.30, 1.35, 5.40, 9.45)
స్ర్కీన్-3 : పుష్ప-2 (5.55, 10.00, 2.05, 6.10, 10.15)
స్ర్కీన్-4 : పుష్ప-2 (5.40, 9.45, 1.50, 5.55, 10.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : పుష్ప-2 (9.45, 1.45, 5.50, 9.50)
స్ర్కీన్-3 : పుష్ప-2 (6.00, 10.00, 2.00, 6.05, 10.05)



దేవి : పుష్ప-2 (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : పుష్ప-2 (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : పుష్ప-2 (11.15, 2.15,6,15, 9.15)
లలితామహాల్ : పుష్ప-2 (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్